


కాంగ్రెస్‌లోకి 'గంగుల'?

- జోరుగా సాగుతున్న ప్రచారం
- అసెంబ్లీ లాబీల్లో కవ్వంపల్లి వ్యాఖ్యలతో కలకలం
- ప్రతిష్ట దిగజార్చేందుకే తప్పుడు ప్రచారమంటున్న గంగుల కమలాకర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మాజీ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారం జిల్లా రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తున్నది. బీఆర్‌ఎస్ పార్టీలో ఈ ప్రచారం కలవరం కలిగిస్తున్నది. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యం మాజీ మంత్రి, కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు అత్యంత కీలకమైన నేత పార్టీని వీడనున్నారని వస్తున్న సమాచారం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్‌లోని కీలక నేతలను అందులో ముఖ్యంగా శాసనసభ్యులను పార్టీలో చేర్చుకొని బీఆర్‌ఎస్‌ను నామమాత్రపు పార్టీగా మార్చాలనే ఆలోచనతో ఉందని ఆ దిశగా సాగిన మొదటి ప్రయత్నంగా పోచారం పార్టీ మార్పిడిని పేర్కొంటున్నారు. ప్రస్తుతం గంగులను పార్టీలో చేర్చుకోవడం ద్వారా కీలక వికెట్‌ను పడగొట్టాలని కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. కొద్దిరోజులుగా గంగుల కమలాకర్ బీజేపీలో చేరుతారంటూ ప్రచారం జరిగినా కాంగ్రెస్ గూటికి చేరేందుకు సర్వం సిద్ధమైందని శనివారం వార్తలు వచ్చాయి. అసెంబ్లీ లాబీల్లో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మీడియాతో చిట్‌చాట్ చేస్తూ కమలాకర్ త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారని వ్యాఖ్యానించడంతో ఈ ప్రచారం ఊపందుకున్నది.

- కరీంనగర్‌లో పుంజుకోవాలని కాంగ్రెస్ యత్నాలు

కరీంనగర్ అసెంబ్లీ స్థానాన్ని, పార్లమెంట్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పెద్దలు జిల్లా కేంద్రంలో బలమైన నేతగా ఉన్న కమలాకర్‌ను పార్టీలోకి తీసుకుంటే బాగుంటుందని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల మాదిరిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో, మున్సి పల్ ఎన్నికల్లో ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో చేదు అనుభవం పునరావృతం కాకుండా చూసుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ముఖ్యంగా బీసీ వర్గాల్లో గట్టిపట్టున్న కమలాకర్‌ను పార్టీలో చేర్చుకోవడం ద్వారా స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించవచ్చని భావిస్తున్నట్లు తెలిసింది. ఆయనను చేర్చుకునే ప్రతిపాదనను ఆచరణలో పెట్టేందుకు కార్యాచరణ ప్రారంభించారని సమాచారం. జిల్లాలో కీలకమైన కరీంనగర్ కార్పొరేషన్‌లో ఇప్పటికే ముగ్గురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు బీజేపీలోకి వెళ్లారు. రెండు రోజుల క్రితం బీఆర్‌ఎస్‌కు చెందిన మేయర్ సునీల్‌రావు ఆ వెనువెంటనే మరో నలుగురు కార్పొరేటర్లు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలువడంతో వారంతా బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని వార్తలు వచ్చాయి. కమలాకర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను, ఇతర ముఖ్యనేతలను పార్టీలోకి ఆహ్వానించి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని, జిల్లాలో తిరుగులేని శక్తిగా మారాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ నుంచి ముఖ్యనేతలు కాంగ్రెస్, బీజేపీల్లో చేరడం ఆ పార్టీశ్రేణుల్లో కలవరం కలిగిస్తున్నది.

పార్టీ మారను.. బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..

- మాజీ మంత్రి గంగుల కమలాకర్

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తాను కాంగ్రెస్‌లో చేరుతున్నానని జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తనను వ్యక్తిగతంగా అప్రతిష్టపాలు చేసేందుకే రాజకీయంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కొంత కాలం బీజేపీలో చేరుతున్నారంటూ ప్రచారం చేసి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారని అంటున్నారని అన్నారు. తాను ఏ పార్టీకి వెళ్లేది లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. సోమవారమే కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం అంటూ ప్రచారం చేస్తున్నారని, తాను ఆదివారమే విదేశాలకు వెళ్తున్నానని తెలిపారు.

అక్రమ కట్టడాలపై బల్దియా నజర్

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో గ్రీవెన్స్ మానిటరింగ్ కమిటీ
- సోమవారం నుంచి ప్రత్యేక కౌంటర్‌లో ఫిర్యాదుల స్వీకరణ



కరీంనగర్ టౌన్, జూన్ 22: ప్రభుత్వ స్థలాల్లో అధికార దుర్వినియోగం, ఇతరత్రా ప్రలోభాలతో అనుమతి పొంది ఇళ్లను నిర్మించడం, అనుమతి లేకుండానే అక్రమంగా ఇళ్లను నిర్మించడం, అనుమతి కంటే ఎక్కువగా నిర్మాణాలు చేయడంపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నగరపాలక సంస్థ సమీక్షా సమావేశంలో ఈ అంశాలపై ఆరా తీశారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయిలో విచారణ జరుపాలని అన్నారు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు తదుపరి చర్యలకు కార్యాచరణ రూపొందించారు. ఇళ్ల నిర్మాణాలకు, అక్రమ కట్టడాలు, అనుమతి లేని భవనాలపై వచ్చే ఫిర్యాదుల కోసం నగరపాలక సంస్థలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో స్థానిక సంస్థల అదనపు కల్టెర్, ఆర్డీవోతో పాటు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సోమవారం నుంచి నగరపాలక సంస్థలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నది. మరోవైపు కలెక్టర్ ఆదేశాలతో శనివారం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు, రెవెన్యూ అధికారితో కలిసి నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఫిర్యాదులు వచ్చిన అపార్టుమెంట్లను, వాణిజ్య, గృహనిర్మాణాల సముదాయాలను, డీవియేషన్‌తో నిర్మించిన ఇళ్లను, భవనాలను పరిశీలించారు. వీటిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. నగరంలో వందల సంఖ్యలో అక్రమ, అనుమతి లేని, డీవీయేషన్ ఇళ్ల నిర్మాణాలతో నగరపాలక సంస్థ ఖజానాకు భారీగా గండి పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టిపెట్టడం మంచిదేనని, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు

గణేశ్‌నగర్, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు బీసీ అభివృద్ధి అధికారి రాజమనోహర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు టీటీర్టీ.ఙుట్ట్యఙుఙుఙుఙిజిట్‌ఛిఙ్నా.ఛిఙుఙుఙు ఠి.జీ వెబ్‌సైట్‌లో జులై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ లో జులై 8, 9, 15, 16, 22, 23, 30, 31 తేదీల్లో ఉదయం 10 నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

గంగాధర, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. శనివారం గంగాధర మండలం బూరుగుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అందాయా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులు యూనిఫాం ధరించి హాజరు కాకపోవడంతో ఎందుకు వేసుకోలేదని అడిగారు. చిన్న సైజులో ఉన్న యూనిఫాంలు అందించారని, అవి పట్టడం లేదని విద్యార్థులు డీఈవోకు తెలిపారు. తగిన సైజులో యూనిఫాం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిసెఫ్ సహకారం ప్రశంసనీయం

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్



యూనిసెఫ్ ప్రతినిధికి సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్

కరీంనగర్ అర్బన్, జూన్ 22: జిల్లాలో కొది కాలంగా యునిసెఫ్ స్వచ్ఛత కోసం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి శ్రీధర్ అన్నారు. ఈ సహకారం జిల్లా స్వచ్ఛతలో సుస్థిరత సాధించేందుకు మ రింత దోహదపడేలా ఉండాలన్నారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల ప్రతినిధులకు కరీంనగర్‌లోని నిర్వహిస్తున్న మూడు రోజుల 'మంథన్' సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రానున్న కాలంలో జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్యక్రమాలకు యూనిసెఫ్ సహకారం ఆశిసు్తన్నట్లు తెలిపారు. ఈ సదస్సు ద్వార వివిధ రాష్ట్రాలలో, వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెంకటేష్ మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా 'వాష్' పారిశుద్య విభాగంలో విశిష్ట సేవలు అందించిన ఆరోగ్యం, నర్సింహారెడ్డి, కిషన్‌స్వామిని సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభాత్, ఫణీంద్ర, కాశీనాథ్, దిలీప్, శ్రీనివాసరావు, రమేష్, వేణు, కళ్యాణి, రవిందర్ పాల్గొన్నారు.

పెన్షన్లు మంజూరు చేయాలి



తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

తిమ్మాపూర్, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యలయం ఎదుట బీజేపీ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా పెన్షన్లపై నిర్ణయం తీసు కోకుండా జాప్యం చేస్తోందని విమ ర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని నాగేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగదీశ్వరాచారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కుల తిరుపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్, నాయకులు ఎల్కపల్లి స్వామి, దుర్శెట్టి రమేష్, కంది రాజేందర్‌రెడ్డి, జీవన్, భూంరెడ్డి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకమిషనర్‌గా ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూన్ 22: నగరపాలక సంస్థ కమిషనర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అదనపు బాధ్యతలను స్వీకరించారు. కమిషనర్ బి శ్రీనివాస్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అదనపు కలెక్టర్‌కు కమిషనర్ బాధ్యతలను అప్పగించారు. గతంలో కూడా పూర్తి అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా ఆయన పని చేశారు. కమిషనర్ శ్రీనివాస్ సెలవుపై వెళ్లడంతో మళీంల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కే కమిషనర్ బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయన శనివారం బాధ్యతలను స్వీకరించి వెంటనే వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు తెలిసింది.



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

పోలీసులకు పతకాలు

కరీంనగర్ క్రైం, జూన్ 22 : రాష్ట్ర పోలీసు శాఖలో వివిధ హోదాల్లో విధినిర్వహణ సందర్భంగా సమర్థత, ప్రతిభ కనబర్చిన పోలీసులకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం శనివారం పతకాలు ప్రకటించింది. రాష్ట్ర అవతరణ రోజున ప్రకటించాల్సిన పతకాలను ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా ప్రకటించారు. కరీంనగర్ అడిషినల్ డీసీపీ (అడ్మిన్)గా పనిచేసి, ఇటీవల రామగుండ కమిషనరేట్‌కు బదిలీ అయిన సీహెచ్ రాజు, కరీంనగర్ ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అంజనేయులుకు మహోన్నత సేవపతకాలను ప్రకటించారు. కరీంనగర్ సెంట్రల్ ఇంటలిజెన్స్ ఏఎస్ఐ మీర్జా మహ్మద్ బేగ్, సీసీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్ హసనొద్దీన్ ఉత్తమ సేవపతకానికి ఎంపియ్యారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏఎస్ఐ దాసరి రమణా రెడ్డికి, కరీంనగర్ రూరల్ పోలీసుఠాణా హెడ్‌కానిస్టేబుల్ పరమేశ్వర్లు సేవాపతకాలకు ఎంపికయ్యారు.

సీసీఎస్ సీఐగా బి శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ సీసీఎస్ సీఐగా బి శ్రీనివాస్ నియమితులయ్యారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంఖిడి సీఐగా పనిచేస్తున్న బి శ్రీనివాస్‌ను కరీంనగర్ సీసీఎస్ సీఐగా బదిలీ చేస్తూ శనివారం మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌లోని మరి కొందరు సీఐలు, ఎస్ఐల త్వరలో బదిలీ అవుతారని సమాచారం.

మండుతున్న కూరగాయల ధరలు



హుజూరాబాద్ మార్కెట్ లో కూరగాయలు

హుజూరాబాద్, జూన్ 22: కూరగాయల ధరలు రోజు రోజుకు మండుతున్నాయి. రైతులు ఎండకాలంలో కూరగాయలు సాగు చేయగా, ఎండ తీవ్రతకు మొక్కలు దక్కకపోవడంతోనే ధరలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను తీసుకువస్తుండడంతో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. టమాట, బీరకాయ కిలోకు 100 రూపాయలు, చిక్కుడుకాయ, క్యారెట్, కాకరకాయ కిలోకు 80 రూపాయలకు చేరుకున్నాయి. పచ్చిమిర్చి, క్యాబేజీ, బీట్‌రూట్ కిలో 60, మునగకాయ కిలో 250, బెండకాయ, దోసకాయ, అలసంద, వంకాయ కిలోకు 50 రూపాయల ధరలు పలుకుతున్నాయి. రైతులు ఇప్పుడిప్పుడే కూరగాయల సాగు మొదలు పెట్టారు. పంట చేతికొచ్చేందుకు మూడు నెలలకు పైగా సమయం పడనుంది. అప్పటి వరకు ధరలు ఇలాగే పెరుగుతున్నాయని కూరగాయల వ్యాపారులు అంటున్నారు. కిలో చికెన్ 250, మటన్ కిలో 800 రూపాయలు మార్కెట్లో ధర పలుకుతుంది. దీంతో సామాన్యుడు ప్రస్తుతం తినలేని పరిస్థితి నెలకొంది.

వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆట


కన్నాపూర్‌లో కప్పతల్లి ఆడుతున్న గ్రామస్థులు

శంకరపట్నం, జూన్ 22: వరుణ దేవుడి కరుణ కోసం మండలంలోని మండలం కన్నాపూర్ గ్రామంలో రైతులు కప్పతల్లి ఆట ఆడారు. గత ఏడాది ఇప్పటికే విత్తనాలు వేశామని, నాట్లు కూడా కొంత మేర పూర్తి చేశామని మృగశిర కార్తి వెళ్లిపోతున్నా భారీ వర్షం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వర్షాలు సమృద్ధిగా పడాలని కప్పతల్లి ఆడుతు న్నామని గ్రామస్థులు తెలిపారు. రోకలి బండకు కప్పతల్లిని పసుపుగుడ్డలో కట్టి ఇంటింటికీ తిరిగారు. మహిళలు బిందెలతో నీరు పోస్తూ వరుణుడు కరుణించాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలోని గాయత్రి ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఆసుపత్రి భవనం రెండో అంతస్థులో ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఆసుపత్రి 2వ అంతస్థులో పేషెంట్లు ఎవరూ లేక పోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా నియంత్రించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 22: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 20మంది వాహనదారుల ను శనివారం కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురికి జైలుశిక్షతో పాటు 6 వేల రూపాయలు జరిమానా విధించారన్నారు. మిగతా 17 మందికి 29,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

హుజూరాబాద్, జూన్ 22: హుజూరాబాద్ డివిజన్‌లో ఎస్‌హెచ్‌వోకు దగ్గరగా మెదిలిన ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం తెలిసింది. హుజూరాబాద్, జమ్మికుంట పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుళ్లు అవినాష్, పాషా, జమ్మికుంట రూరల్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే భాస్కర్‌రెడ్డిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల రోజులుగా హుజూరాబాద్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే ఆఫీసర్లకు అనుకూలంగా పని చేస్తున్నారని కానిస్టేబుళ్లపై సీపీ ఎస్‌బీ, ఇంటలీజెన్సీ విభాగాల ద్వారా సమాచారం సేకరించి బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

రెండో వివాహం చేసుకున్న ఒకరిపై కేసు

జమ్మికుంట రూరల్, జూన్ 22: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కొండు రవీందర్ రెండో వివాహం చేసుకున్నాడని మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందా పూర్‌కు చెందిన రవీందర్‌కు మంచిర్యాల జిల్లా నస్పూర్‌మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన లతతో 2009లో పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవీందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టుగా పని చేస్తున్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి గోవిందాపూర్‌లోనే ఉంటున్నారు. గడిచిన ఏడాది కాలం నుంచి దంపతుల మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది జనవరి 20న కరీంనగర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఫిబ్రవరి 18న గంగాధర మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సంగీత అనే మహిళను ఎల్‌ఎండీ కాలనీలోని నర్సింహస్వామి ఆలయంలో రెండో వివాహం చేసుకున్నాడు. విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకొని తనను, పిల్లలను రోడ్డు మీద పడేసిన భర్తపై మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, జూన్ 22 సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ సదన్ కూమార్ శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 19 వేల నగదు, ఏడు మొబైల్ ఫోన్స్ ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిత్యం పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామని ఎవరైనా గ్యాంబ్లింగ్, బెట్టింగ్, పేకాట వంటి జూదాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు, డయల్ 100కి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మేడిపల్లి/భీమారం : మండల కేంద్రం శివారులో పేకాటరాయుళ్లను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడుల్లో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4.50 లక్షల నగదు, ఒక బైక్, ఒక కారు, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలిగేడు: జూలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాలపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.16.080 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం పట్టుబడ్డ నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లను జూలపల్లి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్, హెచ్‌సీలు శ్రీనివాస్, మహేందర్, కానిస్టేబుళ్లు శేఖర్, అఖిల్, మల్లేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.





హరీష్‌రావు, కేటీఆర్.. రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలి

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 22: రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏకకాలంలో రైతులకు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేయబోతున్నామని ఇక హరీష్‌రావు, కేటీఆర్‌లు రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో కలిసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సీఎం నేతృత్వంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై జిల్లా రైతుల పక్షాన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల సమస్యలను పరిష్కరించి అండగా నిలిచి రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణ మాఫీ చేయబోతున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాలని కోరారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిందని మరోసారి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చినదని చేప్పేందుకు ఆరు గ్యారంటీ పథకాల అమలే నిదర్శనమన్నారు. హరీష్‌రావు మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 65 సీట్లతో సుస్థిరంగా ఉందని ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రెండు దశాబ్ధాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగు కాబోతోందన్నారు. కొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారంటే వారి అవకాశ వాదానికి అది నిదర్శనమని చెప్పవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించడంతో పాటు పంటల పథకంలో రైతుకు సంబంధించిన ప్రీమియం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు సాగుచేసే సన్నరకాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 చెల్లిస్తామన్నారు. రైతు భరోసా విధి, విధానాల అమలుపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టబోతుందన్నారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జగిత్యాల క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విప్, పాల్గొన్న ఎమ్మెల్సీ

రహదారి పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

కరీంనగర్ రూరల్, జూన్ 22: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల వాగు శివారులో గతంలో ప్రభుత్వం అటవీశాఖకు 17.34 గుంటల భూమిని కేటాయించింది. గత కొన్ని నెలల నుంచి ఇరుకుల్ల పరిధిలో జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారి పనులను చేపట్టారు. ఇరుకుల్ల వాగు శివారులో సమ్మక్క గద్దెల సమీపంలో నుంచి రహదారి నిర్మాణ పనులు నడుస్తుండగా అటవీ భూముల్లో దారి నిర్మిస్తున్నారంటూ అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. భూసేకరణ చేపట్టకుండానే తమ భూముల నుంచి రహదారి నిర్మిస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ, ఫారెస్టు, నేషనల్ హైవే అధికారుల సమక్షంలో అటవీభూములను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్సిపెక్టర్ సేవియా నాయక్ ఆధ్వర్యంలో అటవీ భూములను పరిశీలించి ప్రాథమిక సర్వే నిర్వహించారు. మరోసారి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తామని డీఐ సేవియా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఆర్ఐ వాస్తవిక్, సర్వేయర్లు సంతోష్, రాకేష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

జగిత్యాల టౌన్, జూన్ 22: ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో ఇద్దరిపై జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి, ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరి వ్యక్తులకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జగిత్యాలకు చెందిన ముఫీజ్ ఉల్ హక్, వరంగల్‌కు చెందిన ఇంతియాస్ అనే ఇద్దరు వ్యక్తులు రూ. 19 లక్షలు వసూలు చేశారు. రోజులు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని లక్ష్మీదేవి పల్లి గ్రామానికి చెందిన బాధితుడి తండ్రి శంకరయ్య శనివారం జగిత్యాలలో ఉన్న ముఫీజ్ ఇంటికి వెళ్లి నిలదీశాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు శంకరయ్యను కులం పేరుతో ముఫీజ్‌తో పాటు అతని భార్య దూషించారు. దీంతో శంకరయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మానకొండూర్‌లో అదృశ్యం.. కుమరం భీం జిల్లాలో హత్య

● కేసును ఛేదించిన పోలీసులు

మానకొండూర్, జూన్ 22: మానకొండూరులో అదృశ్యమైన యువకుడు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలో దారుణంగా హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. మానకొండూరు గ్రామానికి చెందిన అనంతోజు సాయికిరణ్(29) ఏప్రిల్ 18, 2024న భార్య అనూషతో సిద్దిపేటకు వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె మే 2న మానకొండూరు పోలీసు స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. నాలుగు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫాంలో అనంతోజు సాయికిరణ్ పనిచేస్తుండగా, దహెగాంకు చెందిన బట్టి సునీత, ఆమె భర్త శ్రీనివాస్ పరిచయమయ్యారు. సునీత, సాయికిరణ్‌తో సాన్నిహిత్యంగా ఉండడంతో ఇరు కుటుంబాల్లో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ భార్య అనూషతో కలిసి మానకొండూరుకు వచ్చి కర్ర మిషన్‌లో పనిచేస్తున్నాడు. సాయికిరణ్ ఏప్రిల్18, 2024న మళ్లీ కోళ్ల ఫాంకు వెళ్లగా సునీత, శ్రీనివాస్ దంపతులతో గొడవ జరిగింది. దీంతో సునీత, శ్రీనివాస్ అదే రోజు దహెగాంకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ ఏప్రిల్ 19, 2024న దహెగాంలోని సునీత, శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి సునీత కుటుంబ సభ్యులు తండ్రి తుమ్మిడి గంగారాం, మేనమామ భీంకరి శ్యాంరావుతో పాటు సునీత, శ్రీనివాస్ కర్రతో సాయి కిరణ్‌పై దాడిచేసి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని దహెగాంలోని హనుమాన్ ఆలయ సమీపంలోని పాడుబడ్డ బావిలో పడవేశారు. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ విచారణలో భాగంగా సునీత, శ్రీనివాస్‌ను విచారించగా హత్య విష యాన్ని అంగీకరించారు. శనివారం సాయికిరణ్ మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


సాయికిరణ్ (ఫైల్)

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

● సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

మల్లాపూర్, జూన్, 22: మల్లాపూర్ మండల కేంద్రంలోని శివారులో శనివారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సబ్‌స్టేషన్ ఎదుట మృతి చెందిన పాడి గేదెలను ఉంచి రైతులు ఆందోళన చేపట్టారు. ట్రాన్స్‌కో లైన్‌మన్ రవితేజపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఏడీఏకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ శివారులోని గాంధీనగర్‌వాడ సమీపంలోని బర్ల మంద వద్ద ఉన్న విద్యుత్ స్తంభం తీగలు తెగిపడ్డాయని లైన్‌మన్‌కు నెల రోజులుగా కోరుతున్నామన్నారు. మరోవైపు తెగిపడిన విద్యుత్ తీగలకు కరెంటు సరఫరా అవుతుండటంతో ప్రమాదవశాత్తు రెండు పాడి గేదెలు మృతి చెందాయని తెలిపారు. తెగిన విద్యుత్ తీగలను సరిచేయకపోవడంతోనే రెండు పాడి గేదెలు మృతి చెందాయని ఫోన్ ద్వారా లైన్‌మన్ రవితేజకు తెలుపగా తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఏకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఒక్కో గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందజేసి న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ స్తంభం నేలకొరుగడంతో మందుల భూమయ్య చెందిన సీమ పంది విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 22వేలు నష్టం జరిగిందని తనకు న్యాయం చేయాలని విద్యుత్ అధికారులకు బాధితుడు వినతిపత్రం అందజేశారు.


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు

దొంగ కోసం పోలీసుల గాలింపు

మల్యాల, జూన్ 22: వరుస దొంగతనాల కేసుల్లో నిందితుడైన ఓ దొంగను పట్టుకోవడానికి పోలీసులు శనివారం ఉదయం గాలింపు చేపట్టారు. మండలంలో ఇటీవల ఇళ్లల్లో దొంగతనాలు జరుగడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు శనివారం జగిత్యాల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెలుతున్న ఓ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నిస్తూ మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం వరకు అతన్ని వెంబడించారు. మల్యాల, కొడిమ్యాల పోలీసులు ద్విచక్రవాహనంపై దొంగను అనుసరించడంతో అతను గుర్తించి తన వాహనం వేగాన్ని మరింతగా పెంచి పారిపోయినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంలో దొంగ కోసం వెతికినా ప్రయోజనం లేకపోగా తృటిలో దొంగ తప్పిపోవడం, వెంటనే సెల్‌ఫోన్ ఆఫ్ చేయడంతో అతను వెళ్లిన మార్గం తెలియనట్లు సమాచారం. దొంగ తప్పించుకోవడంతో పోలీసులు గాలింపు మరింత పెంచినట్లు తెలిసింది.

ఒకరి ఆత్మహత్య

వేములవాడరూరల్, జూన్ 22: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఎల్లాల తిరుపతిరెడ్డి (48) అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డి తండ్రి రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి మృతితో మతిస్థిమితం కోల్పోయిన తిరుపతిరెడ్డి రెండు నెలల నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తన పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు.


తిరుపతిరెడ్డి (ఫైల్)

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 22: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. జేష్ట శుద్ద పూర్ణమితో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చన లు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రాత్రి వరకు భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షంకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ దాడులు

● స్టేషన్ బెయిల్ కోసం లంచం అడిగిన ఎస్సై ● మధ్యవర్తి అరెస్టు .. ఎస్సై పరారీ

రాయికల్, జూన్ 22: జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. స్టేషన్ బెయిల్ కోసం రాయికల్ ఎస్సై అజయ్ లంచం డిమాండ్ చేయడంతో పక్కా సమాచారంతో అధికారులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఏసీబీ అధికారుల రాకను పసిగట్టిన ఎస్సై తన ఇంటి ఆవరణలోని గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తిని అధికారులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి కథనం మేరకు.. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ఈ నెల 11న ఎస్సై తన సిబ్బందితో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై అదే రోజు కేసు నమోదు చేశారు. ఈ విషయమై స్టేషన్ బెయిల్ కోసం రాజేందర్‌రెడ్డి ఎస్సైని కలువగా రూ. 50 వేలు ఇస్తేనే బెయిల్ ఇస్తానని డిమాండ్ చేశాడు. చివరకు రూ.25 వేలకు ఒప్పందం కుదిరింది. అదే రోజు రూ. 15 వేలు అందజేసి మిగతా డబ్బులను తర్వాత ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం మిగతా డబ్బులు ఎస్సైకి ఇచ్చేందుకు పథకం రూపొందించారు. ఏసీబీ అధికారులతో కలిసి బాధితుడు రూ.10 వేలు ఇచ్చేందుకు ఎస్సైని సంప్రదించగా మధ్యవర్తి పుల్లూరి రాజును కలిసి డబ్బులు ఇవ్వాలని వారికి సూచించాడు. దీంతో రాజేందర్‌రెడ్డి మధ్యవర్తి రాజుకు డబ్బులు ఇచ్చి ఇద్దరూ కలిసి రాత్రి 10 గంటల సమయంలో ఎస్సైకి డబ్బులు ఇచ్చేందుకు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్సై లేకపోవడంతో డబ్బులు తెచ్చామని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్సైకి ఏసీబీ అధికారుల వాహనాలు కనబడడంతో స్టేషన్‌లోని క్వార్టర్స్ గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తి రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఎస్సై కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.


రాయికల్ పోలీస్‌స్టేషన్


రాజు అరెస్టును చూపుతున్న ఏసీబీ అధికారులు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, జూన్ 22: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. వైష్ణవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, వివేఎస్ఆర్ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ముగ్గురు, ట్రినిటీ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ధర్మపురిలో ఒకరు డీబార్ అయ్యారన్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన మహిళ

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల డబ్బులు దొంగిలిస్తున్న ఒక మహిళను శనివారం ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన జ్యోతి అనే మహిళ 16వ ప్లాట్‌ఫాం వద్ద హుజురాబాద్‌కు చెందిన అనూష పర్సులో నుంచి నగదు, ఏటీఎం కార్డును, మంచిర్యాలకు చెందిన సరళ బ్యాగ్ నుంచి 3 వేల రూపాయలు దొంగిలిస్తుండగా పట్టుకుని ఒకటో టౌను పోలీసులకు అప్పగించారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 22 : నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్టు గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన దండుగుల సురేష్ అనే వ్యక్తి మండల పరిధిలోని కోళ్లమద్ది గ్రామానికి చెందిన చీకోటి స్వామిని గల్ఫ్ దేశానికి పంపిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేశాడని తెలిపారు. ఒరిజనల్ పాస్‌పోర్టు, 10 వేల నగదును సురేష్ తమ వద్ద తీసుకున్నాడని బాధితుడు స్వామి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ వెల్లడించారు. సురేష్‌ను శనివారం అరెస్ట్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. స్వామి వద్ద 8 ఒరిజినల్ పాస్‌పోర్టులు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

మూలవాగులో మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జూన్ 22: వేములవాడ మూలవాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మల్లారం రోడ్డులో గల మూలవాగు ఇసుక రీచ్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తిగా గుర్తిం చారు. మృతుడు బ్లాక్ ప్యాంట్, తెల్లటి షర్ట్ ధరించి ఉన్నాడని, మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదన్నారు. అనుమానాస్పదంగా ఉన్నవారు వేములవాడ పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

జగిత్యాల టౌన్,జూన్ 22: తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తిని గిఫ్ట్‌డీడ్ చేసుకున్న ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బుగ్గారం మండలం శెఖల్ల గ్రామానికి చెందిన ఠాకూర్ గణేష్ సింగ్‌తో పాటు అతని ముగ్గురి సోదరులకు జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో వారసత్వంగా వచ్చిన ఆస్తి ఉంది. గణేష్ సింగ్ సోదరుడు కిసాన్ సింగ్ తప్పుడు పత్రాలు సృష్టించి ఉమ్మడి ఆస్తిని తన భార్య పేరుమీదికి మార్చి ముగ్గురు సోదరులను మోసం చేశాడు. గణేష్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కిసాన్ సింగ్‌పై కేసు నమోదు చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, జూన్ 22: మండలంలోని తక్కళ్లపల్లి శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. గొల్లపల్లి మండలం గుంజపడుగు చెందిన గందం చందు అనే వ్యక్తి టాటా ఏస్ గూడ్స్ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకొని 13క్వింటాళ్ల బియ్యం, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చందుపై సుమోటో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రావూస్ పాఠశాలలో ఘనంగా ఒలింపిక్ డే



ఒలింపిక్ జెండా ఆకారంలో కూర్చున్న రావూస్ విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 22: నగరంలోని రావూస్ విద్యాసంస్థలో అంతర్జాతీయ ఒలింపిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఒలింపిక్ జెండా ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఉపాధ్యాయులు ఒలింపిక్ చరిత్ర, క్రీడల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఈవో నిధిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



బండి సంజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాయ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 22: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కాయ్)రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ కరాటే అసోసియేషన్, క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకా రాలను అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కరాటే అసోసియషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ ప్రసన్నకృష్ణ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: బండి సంజయ్‌కుమార్‌ను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలతో ముంచెత్తారు.

●బండి సంజయ్‌కుమార్‌ను శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు కలిసి తమను రెగ్యులరైజ్ చేయించాలని ఆయనకు వినతిపత్రం సమర్పించారు.

●గణేశ్‌నగర్: బండి సంజయ్ కుమార్‌ను శనివారం కరీంనగర్‌లో ఎంపీ కార్యాలయంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలోల బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: బండి సంజయ్‌కుమార్‌ను యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్య, ఉపాధ్యక్షుడు పాశం తిరుపతి, కాల్వ శ్రీనివాస్, కూకట్ల రమేశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి

భగత్‌నగర్, జూన్ 22: వేతనాలు ఇప్పించాలని కోరుతూ పోస్టల్ శాఖలోని స్టాఫ్‌గ్యాప్ ఉద్యోగులు కోరారు. ఈమేరకు శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా వేతనాలు రాక తాము, తమ కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించడంతోపాటు ఇకనుంచి వేతనాలు ప్రతినెలా ఇచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ది శ్రీకాంత్, యారా గిరిప్రసాద్, సౌజన్య, బి నిఖిల్, ఎ సన్నికుమార్, ఉమ, ఎస్‌కె సర్వర్ షరీఫ్, జె అజయ్, ఎం వెంకటేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహా పడిపూజ

కరీంనగర్ కల్చరల్, జూన్ 22: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాజ్ దేశ్‌పాండే గురుస్వామి పర్యవేక్షణలో శనివారం వైశ్యభవన్‌లో వివిధ భజన మండలుల ఆధ్వర్యంలో 'నీ గానమే నా ప్రాణం' పేరుతో నిరంతర అఖండ భజన, రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ చీఫ్ కోఆర్డినేటర్‌లు మెతుకు హేమలత పటేల్, నలుమాచు చంద్రశేఖర్, వైశ్య సేవా కేంద్రం బాధ్యులు చిదుర సురేశ్, పెద్ది విద్యాసాగర్, ముస్త్యాల రమేశ్‌తో పాటు చిట్టుమల్ల శ్రీనివాస్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్‌కుమార్, దీప్తి, అనంత నరసయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, జూన్ 22: విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఎంపీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఉద్యోగ అవ కాశాలు కూడా పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగధిపతులు ఆర్ హరీష్, ప్రియాంక, ఏవో రామరావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత

శంకరపట్నం, జూన్ 22: మండలంలోని కేశవపట్నం గ్రామంలోని జాతీయ రహదారి పనులకు సంబంధించిన ఏడు మట్టి టిప్పర్లను ఆర్టీఏ కంచె వేణు శనివారం పట్టుకున్నారు. అధిక లోడ్‌తో పాటు సరైన పత్రాలు లేని కారణంగా మట్టి టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కనుకులగిద్దెలో ఎల్లమ్మ బోనాలు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 22: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో శనివా రం రేణుక ఎల్లమ్మ బోనాలను గౌడకులస్తులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకుల నిరసన



పాఠశాల ఎదుట బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

తిమ్మాపూర్, జూన్22: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతూ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని చెప్పారు. విద్యను వ్యాపారంగా నిర్వహిస్తున్నరని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు లాభార్జనే ధ్యేయంగా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవా లని విజ్ఞప్తి చేశారు., కార్యక్రమంలో శ్రీ వర్ధన్, అనిల్, యోగేష్, అభిరామ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లందకుంట, జూన్ 22: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యా యుడిగా బోధించడం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునిగడపు సత్యనారాయణచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ (ఇంగ్లీష్) బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ ఒర్జినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24న మోడల్ స్కూల్‌లో హాజరు కావాలని సూచించారు.

ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జూన్ 22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరున్నర నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఒక్క సమీక్షా సమావేశాన్ని నిర్వహించలేదన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహిచాలని కోరారు. శనివారం ఆయన నగరశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇన్నాళ్ళు ఎలక్షన్ కోడ్‌ను సాకుగా చూపి సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను బుట్టదాఖలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో అర్హులైన 40శాతం మందికి గృహజ్యోతి, ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ లబ్ధి చేకూరడం లేదని, దీనితో వారు కార్యాలయాలు చుట్టూ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. మహిళలకు ఇస్తామన్న 2,500 రూపాయల పథకం ఏమైందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు తెగిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్, వరంగల్ నగరాలను స్మార్ట్‌సిటీకి ఎంపిక చేయగా నాటి సీఎం కేసీఆర్ సూచన మేరకు ఆనాటి ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఢిల్లీకి వెళ్ళి కరీంనగర్‌కు అర్హత లేకున్నా స్మార్ట్‌సిటీ హోదా తీసుకు రావడంతో 1000 కోట్లనిధులు మంజూర య్యాయని చెప్పారు. నిధులను వినోద్ కుమార్ తీసుకువస్తే గంగుల కమలాకర్ కరీం నగర్‌ను సుందరనగరంగా అభివృద్ధికి కృషి చేశారన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్ నగర అభివృద్ధికి ఆయన కృషి చేయాలని కోరారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీలో రావలసిన 800 కోట్లను, వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట దేవాలయాల అభివృద్ధికి, కరీంనగర్- హసన్‌పర్తి రైల్వేలైను, ట్రిపుల్ ఐటీని తీసుకురావాలని కోరారు. 30 మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తోనే ఉన్నారని చెప్పారు. ఈవిలేకరుల సమావేశంలో నగర ప్రధానకార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు దీకొండ కుల్దీప్‌వర్మ, బోనకుర్తి సాయికృష్ణ, మీర్ షౌకత్, ఆరె రవిగౌడ్, చేతి చంద్రశేఖర్, సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఓటమికి మంత్రిదే బాధ్యత'

సుభాష్‌నగర్, జూన్ 22: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఓటమికి మంత్రి పొన్నం ప్రభాకర్‌దే నైతిక బాధ్యత అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టుబట్టి టికెట్ ఇప్పించుకున్న కరీంనగర్ అభ్యర్థి విషయంలో పొన్నం ప్రభాకర్ ప్రతిభ ఎందుకు పనిచేయలేదన్నారు. ఈ సమావేశంలో చిగిరి శ్రీధర్, బాపురెడ్డి, రవీందర్, రామ్‌రెడ్డి, గాదం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్, సోహెన్‌సింగ్‌కు లీగల్ నోటీసు

-మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 22: గత కొంత కాలంగా 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్ కౌర్, ఆమె భర్త సోహెన్‌సింగ్ ఉద్దేశ పూర్వకంగా తనపై అసత్యపు ఆరోపణలు చేస్తుండడంతో వారికి హైకోర్టు నుంచి లీగల్ నోటీసులు జారీ చేశామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. వారు వివిధ విషయాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా మీడియా సమావేశాలు పెట్టి తనపై అసత్యపు ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రజల్లో అసత్యాలు, అవాస్తవాలను ప్రచారం చేస్తూ తన గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తున్నారని, దీనితో వారిపై న్యాయపరమైన చర్యల కోసం హైకోర్టు నుంచి శనివారం లీగల్ నోటీసు పంపించామని మేయర్ తెలిపారు.

నేడు 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూన్ 22: తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10-30 గంటల నుంచి ముఖరంపుర వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సంపాదకుడు, గ్రంధ ప్రచురణ కర్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్యచే వెలువరించిన 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణను, సాహితీవేత్తలకు ఆత్మీయ సత్కారాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొత్త అనిల్‌కుమార్, దొమ్మాటి శంకర్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, అతిథిగా సాహితీవేత్త డాక్టర్ సంగనభట్ల నరసయ్య హాజరౌతారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ మలయశ్రీ, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గంధ్ర లక్ష్మణరావు, వారాల ఆనంద్‌లకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 22: నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ భూనీళా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహో త్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఈఓ ఎస్ శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పి శ్రీనివాస్, భక్తులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సుదర్శన, నారసింహ హోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు ద్వాదశారాధన, సప్తావరణాలు, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతుల ఇక్కట్లు



బావి వద్ద కుంగిన విద్యుత్ పోల్

కరీంనగర్ రూరల్, జూన్22: కరీంనగర్ రూరల్ మండలంలో విద్యుత్ సమస్యలతో పలు గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో బొమ్మకల్ గ్రామ శివారు మానేరు వాగులో నాలుగు ఆవులు మృతిచెందాయి. మొగ్దుంపూర్ గ్రామ శివారులో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ కరెంటు వైర్లపై స్తంబాలు పడి కరెంటు సరఫరా నిలిచిపోగా సరిచేశారు. మండలంలోని జూబ్లీనగర్ గ్రామంలో ఒక రైతు బావి వద్ద గతంలో కురిసిన వర్షాల కారణంగా బావి వద్ద విద్యుత్ పోలు కుంగి ప్రమాదకరంగా మారింది. రైతు డి.భాస్కర్‌రెడ్డికి చెందిన వ్యవసాయ భూమి సర్వేనెంబర్ 110, బావి నెంబర్2 వద్ద ఈపరిస్థితి నెలకొంది. అయితే విద్యుత్ స్థంభం బావిలోకి జారగా అలానే పడి ఉంది. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

చొక్కారావు, తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 22: స్మార్ట్‌సిటీలో భాగంగా వన్‌టౌన్ ఎదురుగా జంక్షన్ సుందరీకరణ కోసం అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణతల్లి, మాజీ ఎంపీ చొక్కారావు విగ్రహాలను తొలగించారని, మంత్రి పొన్నంకు ప్రేమ ఉంటే ఎక్కడి విగ్రహాలను అక్కడే పెట్టించాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణతల్లి విగ్రహాన్ని మేమే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. శనివారం ఆయన నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన నగరపాలక సంస్థ సమీక్షలో మున్సిపల్‌లో అవినీతి జరిగిందని చెప్పిన మంత్రి సిట్‌తో విచారణకు లేఖరాయాలని కోరారు. సమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, జక్కని నర్సయ్య, పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తం

- ఐదేళ్ల క్రితం ప్రారంభించినా పూర్తి కాని వైనం



కొనసాగుతున్న రహదారి పనులు



నిలిచిన వర్షం నీరు

వీణవంక, జూన్ 22: రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఈ పనులు నత్తనడకన కాంట్రాకర్ ఇష్టారీతిన చేపడుతుండడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. .జమ్మికుంట నుంచి నర్సింగాపూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు ఐదేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. నర్సింగాపూర్ గ్రామంలో చేపడుతున్న పనుల్లో కనీసం సూచికా బోర్డులు పెట్టకుండనే ఇరు వైపులా పనులు చేపడు తున్నారు. సూచికలు లేక పోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కంకర పోసిన నీరు చల్లక పోవడంతో వాహన రాకపోకలతో దుమ్ము లేస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వల్భాపూర్ గ్రామ చివరులో రెండు వైపులా తారు రోడ్డు వేశారు. కాగా కాంటాక్టర్ ఓ వైపున కంకర మట్టి నిల్వ చేయడంతో వాహనదారులు ఒకే వైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరో వైపు పనులు పూర్తి కాకపోవడంతో వర్షం నీరు రోడ్డుకు ఓవైపు నిలిచిపోతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు పనులు నాణ్యతతో చేపట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా కుమారస్వామి

సైదాపూర్, జూన్ 22: సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పెసరు కుమారస్వామిని శనివారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కుమారస్వామిని శాలువాతో ఘనంగా సనా నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెన్నంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధితో పాటు జిల్లాలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు, మత్స్యకారుల సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నెల్లి శ్రీనివాస్, పెసరు కొంరయ్య, రేగుల సమ్మయ్య, నెల్లి వీరేశం, పెసరు హరీష్, రాజయ్య, అశోక్, సురేష్, రాకేష్, సాయికృష్ణ, రాజు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గంగాధర, జూన్ 22: గంగాధర లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం శనివారం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా శ్రీరాంశ్రావణ్, కార్యదర్శిగా సమ్మయ్య ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గంగాధరలో క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు.

కూలిన గోడను పరిశీలించిన ఆర్ఎం

శంకరపట్నం, జూన్ 22: శంకరపట్నం మండలం కేశవపట్నంలోని బస్టాండ్ ప్రాంగణం గోడ కూలిపోగా శనివారం కరీంనగర్ ఆర్ఎం సుచరిత పరిశీలించారు. ప్రహరీ గోడను అనుకొని ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం పనులు చేపట్టారు. మట్టి ప్రహరీ గోడను అనుకొని పోయడంతో ఇటీవల కూలిపోయింది. గోడ నిర్మాణం చేపట్టాలని, ఇంటి యజమానికి సూచించారు.

పాఠ్యపుస్తకాల విక్రయాలపై కమీషన్ తీసుకోవద్దు

జమ్మికుంట, జూన్ 22: జమ్మికుంటలోని ప్రవేట్ విద్యా సంస్థలలో పాఠ్యపుస్తకాలు కమీషన్ తీసుకుని విక్రయించకుండా చూడాలని తహసీల్దార్ కార్యాలయంలో విద్యా ర్థుల తల్లిదండ్రులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాలు నేరుగా విద్యా సంస్థల యజమానులే అధిక ధరలకు బుక్‌స్టాల్స్‌లో పెట్టించి అమ్మకాలు చేస్తున్నార న్నారు. వీటిపైనా విద్యాసంస్థలకు కమీషన్‌ల రూపంలో డబ్బులు చెల్లిస్తున్నారని తెలిపారు. అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న బుక్‌స్టాళ్లపై తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, సుశాంత్, శ్రీనివాస్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ పాఠశాలలు పునఃప్రారంభం



చొక్కారావుపల్లిలో ప్రారంభించిన పాఠశాల(ఫైల్)

గన్నేరువరం, జూన్ 22: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధుల చొరవతో మూతపడ్డ పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో మొత్తం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 7, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 2 ఉన్నాయి. యాశ్వాడ, సాంబయపల్లి, తుమ్మనానిపల్లి, పంతుల్ కొండాపూర్, మొత్కులపల్లి, చొక్కారావుపల్లి, గోపాల్‌పూర్ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల ల్లో విద్యార్థులు లేక ఏళ్ల తరబడి మూసివేశారు. ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో చొక్కారావుపల్లి లోని పాఠశాల 15 ఏళ్లకు పునఃప్రారంభమైంది. 23మంది విద్యార్థులు బడిలో చేరారు. పదేళ్ల క్రితం మూతపడ్డ గోపాల్‌పూర్‌లోన్ని సర్కారు బడిని రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఆదేశానుసారం అధికారులు, ప్రజాప్రతినిధులు పునఃప్రారంభించారు. . మిగతా గ్రామాల్లో మూలనపడ్డ పాఠశాలలను సైతం పునఃప్రా రంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూన్ 22: కిసాన్‌నగర్‌కు చెందిన కొయ్యడ ప్రమోద్‌కుమార్(47) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. ప్రమోద్‌కుమార్ కొంతకాలంగా మానసిక ఒత్తిడిలకు గురవుతున్నాడని, ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. 15 ఏళ్ళ కిందట వివాహమైన ప్రమోద్‌కుమార్‌కు కొడుకు, కూతురులు ఉన్నారు.

ఏడు సంవత్సరాల నుంచి ప్రమోద్ అతని భార్యకు దూరంగా కిసాన్‌నగర్ లోని తన ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మానసిక ఒత్తిడితో శని వారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో తన గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గణేశ్‌నగర్, జూన్ 22: టీజీఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన వచ్చిందని విద్యుత్ శాఖ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. టీజీ ఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో మెడికవర్ ఆసుపత్రి వారిచే నిర్వహించిన మెడికల్ క్యాంపును సీజీఎం హెచ్ఆర్డీ మధుసూదన్, వడ్లకొండ గంగాధర్ ప్రారంభించారు. విద్యుత్ ఉద్యోగులు సుమారు 230 మంది పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఈక్యాంపులో డాక్టర్లు రామనాథ్, ప్రతిష్టారావు, నాగరాజు వేణుగోపాలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్కిల్ ఆఫీసు ఆవరణలో సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారిచే తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి 15 మంది విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఇందులో డీఈలు జే.రాజం, ఎం.తిరుపతి రక్తదానం చేశారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు పెండ్యాల కేశవరెడ్డి చైర్మన్ చిదురు సురేష్ వైస్ చైర్మన్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి సెక్రెటరీ డాక్టర్ బొమ్మిడి మహేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశ మందిరంలో వాసన్ ఐ కేర్ హస్పిటల్ వారిచే నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో విద్యుత్ ఉద్యోగులు 186 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. వాసన ఐ హాస్పిటల్ వారు అజయ్ వంశీ రజిని తదితరులు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డీఈలు విజేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, చంద్రమౌళి, లక్ష్మారెడ్డి, గోపీకృష్ణ, రాజేశం, ఏవో రాజేంద్రప్రసాద్ పిఓ బండారి చంద్రయ్య రఘుపతి పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ నిర్ణయంపై హర్షం

కరీంనగర్ అర్బన్, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం 2లక్షల రుణమాఫీ నిర్ణయంపై టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, వరంగల్ రైతు డిక్లరే షన్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనకు ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ తెలంగాణ రైతాంగం పక్షాన రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జూన్22: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం విద్యానగర్‌లో 134వ ఎన్నీల ముచ్చట్లకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లౌక్యం, ప్రయోజన దృష్టి ఉంటే నిజమైన కవిత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య సమన్వయ కర్తలుగా వ్యవహరించగా ఎంపీడీఓ అలుగోజు కుమారస్వామి ఆతిథ్యం ఇచ్చారు.

కార్యక్రమంలో బూర్ల వేంకటేశ్వర్లు, డాక్టర్ మచ్చ హరిదాసు, గాజోజు నాగభూషణం, పుప్పాల శ్రీరాం, ఎండి ఖలీద్, పరశు రామారావు, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, నడిమెట్ల రామయ్య, తోట నిర్మలారాణి, పెనుగొండ బసవేశ్వర్, నసీరుద్దీన్, విలాసాగరం రవీందర్, వాసాల వరప్రసాద్, సదాశ్రీ, ఇటిక్యాల రాము, గుడికందుల అరుణ్, డాక్టర్ విజయ్ పలువురు కవులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి పోటీలు

చొప్పదండి, జూన్ 22: స్పోర్ట్స్ స్కూల్‌లో నాల్గో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే మండల స్థాయి ఎంపిక పోటీలను ఈనెల 25న చొప్పదండి జడ్పీ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వేణుకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటాలతో ఫిజికల్ డైరెక్టర్‌ను సంప్రదించాలని సూచించా రు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

తిమ్మాపూర్: క్రీడా పాఠశాలల్లో నాల్గో తరగతికి ప్రవేశాలకు తిమ్మాపూర్ మండల స్థాయి ఎంపిక పోటీలు ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9652637673లో సంప్రదించాలని సూచించారు.

గన్నేరువరం: జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25న మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 1-9-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. వివరాలకు జంగపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీడీని సంప్రదించాలని కోరారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 24, 25 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కే శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. క్రీడా పోటీలకు సంబంధించి మండల స్థాయి వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల కన్వీనర్ పి కనుకయ్య, సూర్యప్రకాశ్, జ్యోతి, కల్పన, రజిత తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు పూజలు

చొప్పదండి, జూన్ 22: మండలంలోని రుక్మాపూర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోమాతకు పూజలు చేశారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవేంకటేశ్వ

మంత్రికి ధన్యవాదాలు

చిగురుమామిడి, జూన్ 22: మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించిన సందర్భంగా శనివారం జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ధన్యవాదా లు తెలిపారు.

ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగెల్లి పకుళ- లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగల చేతివాటం

శంకరపట్నం, జూన్ 22: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం పర్యటనలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. సహకార సంఘం భవనాన్ని బండి సంజయ్‌కుమార్ ప్రారంభించిన కార్యక్రమానికి కరీంపేట గ్రామానికి చెందిన ఎగుర్ల సంపత్ హాజరు కాగా, ప్యాంటు వెనుక జేబులో ఉన్న రూ. 10వేల నగదును దొంగలు చోరీ చేశారు. కాగా శనివారం కేశవపట్నం పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.